RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | ఎడిటర్: చెరుకు ఉపేందర్ | ఆదివారం 2 నవంబర్ 2024

సంపుటి: 2 | సంచిక: 173 | పేజీలు: 4 | వెల: రూ.5/-



## 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

### కీలక బిల్లులకు ఆమోదించే అవకాశం

న్యూఢిల్లీ-ప్రభాత సూర్యుడు: పార్లమెంట్ శీతాకాల సమావేశాల నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం సమాయత్తమవుతోంది. నవంబర్ 25 నుంచి డిసెంబర్ 20 వరకూ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నిర్వహించాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలిసింది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్రతిపాదనపై ఈ శీతాకాల సమావేశాల్లో కీలకంగా చర్చించనున్నారు. వక్ఫ్ సవరణ బిల్లు 2024కు కూడా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ..మిగతా 2లో

# ఈ నెల 6 నుండి 19 వరకు

# బీసీ కుల గణన సర్వే



## పారదర్శకంగా జరిగేనా?

## బీసీలు కులగణన సర్వే నమోదులో పాల్గొంటారా?

- బీసీల కళ అయిన, కులగణన సర్వేను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించాలి.
- ఫ్లెక్సీలతో, నాలుగు రోడ్ల చౌరస్తా లలో సాంస్కృతిక ధూమ్ ధామ్ కళాకారులతో కులగణన ప్రాముఖ్యతను ప్రచారం చేయాలి
- తెలంగాణ గ్రామాలలో డబ్బు చాటింపులు నిర్వహించి, గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలి.
- ఇప్పటివరకు బీసీ రిజర్వేషన్ల ఫలాలను పొందుతున్న బీసీ సమాజమంతా ఏకమై ప్రచారం చేయాలి.
- బీసీ నాయకుల మని చెప్పుకుంటున్న ప్రతి ఒక్కరూ వారి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.
- యాదృచ్ఛిక మో!!! అదృష్టమో!!! న్యాయస్థానాల చొరువతో నో!!!!
- సర్వేకు ముందు కొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్ ను అభినందించాల్సిందే!!!!
- నిజంగా జనాభాలో 52 శాతం బీసీల వారి భవిష్యత్తుకు మైలురాయి, బీసీ కులగణన దేశ రాజకీయాలలో ప్రభావితం కానున్నది.
- బీసీ కులాల వారందరు ఏకమయ్యే సమయం ఆసన్నమైనది.
- దేశ భవిష్యత్తు బీసీ వర్గాలకే అన్న నగ్నసత్యాన్ని గుర్తు ఎరగండి.

ప్రభాత సూర్యుడు దినపత్రిక చీఫ్ ఎడిటర్ కస్తా శంకర్రావు కులాల సర్వే వార్త

హైదరాబాద్-ప్రభాత సూర్యుడు: ఎట్టకేలకు గౌరవ న్యాయస్థానాలు చొరవ తీసుకుని బీసీ కుల గణన చేయాలని ఆదేశించడంతో ఈనెల 6 నుండి 19 వరకు రాష్ట్రంలో బిసి కుల గణన నిర్వహిస్తున్నామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించడంతో రాష్ట్రంలో బీసీ కుల గణన సర్వే పనులు ముమ్మరం చేశారు. మొత్తం జనాభాలో బీసీలు 52 శాతం ఉన్నారని జనాభా ప్రాతిపధకన బీసీల వాట బీసీలకు చెందాలని ముఖ్యంగా ఉద్యోగాలలో, చట్ట సభలలో, స్థానిక సంస్థల ఎన్నికలలో, బీసీ మహిళలో వారికి భారత రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ఫలాలను బీసీ దామాషా లెక్క ప్రకారం బీసీల వాటా బీసీల కే చెందాలని ఎన్నో ఏళ్లుగా బీసీ నాయకులు రోడ్డు ఎక్కిన విషయం తెలిసిందే. అంతే కాకుండా బీసీ మేధావులు సుప్రీంకోర్టు, హైకోర్టు,లను ఆశ్రయించి న్యాయ పోరాటం చేసిన విషయం కూడా తెలిసిందే.

బీసీ నాయకుల పోరాట ఫలితమో!!!! న్యాయస్థానాల ముందు చూపో??? బీసీలను ప్రసన్నం చేసుకోకపోతే!!! తమ రాజకీయ ఉనికి కే?? ప్రమాదం ఏర్పడుతుందనే !!! భయంతోనో!!! భక్తితోనో!!! తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తో సహా, రాష్ట్రంలోని ..మిగతా 2లో

### "తెలంగాణలో బిసి కులగణన సర్వేను స్వాగతిస్తున్నాం"

#### తెలంగాణ రాష్ట్ర విద్యావంతుల వేదిక ఉపాధ్యక్షుడు బండి సాయన్న



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బిసి కుల గణన సర్వే ను తెలంగాణ బీసీ విద్యావంతుల వేదిక తరపున స్వాగతిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర బీసీ విద్యావంతుల ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు మరియు గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ అధ్యక్షుడు బండి సాయన్న తెలిపారు. ఈనెల 6 నుంచి బీసీ ల కులగణన సర్వే ను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని బీసీ కులాల వారికి అవగాహన కల్పించాలని అన్నారు. తెలంగాణ బీసీ సమాజమంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది అని అన్నారు.



### అద్భుతమైన స్కీములకు

## స్కాములుగా ముద్ర

#### తెల్లారితే బూట్ల చప్పళ్లతో తెల్లారుతున్న తెలంగాణ

#### ఎక్స్ వేదికగా ప్రభుత్వంపై కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్-ప్రభాత సూర్యుడు: కేసీఆఆర్ ప్రభుత్వం అమలు చేసిన అద్భుతమైన స్కీములను స్కాములని దుష్ప్రచారం చేసిన దుర్మార్గులు ఇకనైనా తీరు మార్చుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవు పలికారు. గత పదేండ్లలో తెలంగాణలో వేల కోట్ల అభివృద్ధి జరిగిందని కేంద్రం ప్రకటించిన లెక్కలను చూసైనా బుద్ధి తెచ్చుకోవాలంటూ చురకలంటించారు. కళ్లముందు ఆవిష్కృతమైన ఈ అద్భుతాలను చూసి ఇప్పటికైనా మారాలని సూచించారు. పంటల దిగుబడిలోనే కాదు, పశు సంపదలోనూ గత పదేండ్లు పండగేనని చెప్పారు. కులవృత్తులకూ కేసీఆర్ కొండంత అండగా నిలవడం వల్లే పశుసంపదలోనూ గణనీయ వృద్ధి సాధించని తెలిపారు. గ్రామిణ తెలంగాణలో ఉపాధి పెంచాలనే తపన, సంపద సృష్టిలో అందరినీ భాగస్వామ్యం చేయాలనే తాపత్రయం ..మిగతా 2లో

### బిజెపి రాష్ట్రాల్లో చీకట్లు..

## మా రాష్ట్రంలో వెలుగులు

### 11 నెలల్లోనే సంక్షేమం, అభివృద్ధి పరుగులు

#### 48 గంటల్లోనే రెండు వాగ్దానాలను నెరవేర్చాం

#### 11 నెలల్లోనే దాదాపు 50 వేల మంది యువతకు ఉద్యోగాలు

#### బీఆర్ఎస్ దుషపరిపాలనకు చరమగీతం పాడాం

#### పేదలకు ఆరోగ్యశ్రీని పది లక్షలకు పెంచాం

#### ప్రధాని మోడీ విమర్శలకు ఎక్స్ వేదికగా రేవంత్ ఘాటు సమాధానం



హైదరాబాద్-ప్రభాత సూర్యుడు: కాంగ్రెస్ హయాంలో చీకట్లను తరిమేసి వెలుగులు నింపామని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ, తక్కువ ధరకే గ్యాస్ సిలిండర్ ఇలా తదితర అంశాలను వివరిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ మేరకు ప్రధాని మోడీ విమర్శలకు ఘాటు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ఆనందం వెల్లువిరుస్తోందన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన 48 గంటల్లోనే రెండు వాగ్దానాలను నెరవేర్చామని.. 11 నెలల్లోనే దాదాపు 50వేల మంది యువతకు ఉద్యోగాలు కల్పించామని సీఎం రేవంత్ ఎక్స్‌లో పోస్టు చేశారు. 'ప్రియమైన నరేంద్ర మోదీ జీ. నా రాష్ట్రం, నా ప్రభుత్వం గురించి మీరు చేసిన ప్రకటనలలో అనేక అపోహలు, అవాస్తవాలపై స్పష్టత ఇవ్వడానికి నేను సంతోషిస్తు న్నాను. డిసెంబర్ 7 న తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసినప్పటి నుంచి రాష్ట్రంలో ఆనందం ఆశలు వెల్లువెత్తాయి. దశాబ్దం బీఆర్ఎస్ ..మిగతా 2లో



### రాష్ట్రంలో క్రమంగా

## పెరుగుతున్న చలి

హైదరాబాద్-ప్రభాత సూర్యుడు: తెలంగాణలో క్రమంగా చలి ప్రభావం మొదలైంది. దీపావళికే తీవ్ర చలి ఉండాల్సి ఉండగా కొంత ఆలస్యంగా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. ఇలా చలి తీవ్రతను పెంచుతున్నాయి. చలి ప్రభావంతో జనం గజగజ వణుకుతున్నారు. ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతుండటంతో చలి తీవ్రత పెరుగుదలకు కారణమైంది. సాయంత్రం ఆరు గంటలు అయ్యిందంటే ప్రజలు చలికి ఇళ్ల తలుపులు మూసుకుంటున్నారు. మళ్లీ ఉదయం ఎనిమిది గంటలు అయితేగానీ తలుపులు తీయడం లేదు. అప్పటి వరకు రోడ్లు కూడా నిర్మానుష్యంగా మారుతున్నాయి. చలి తీవ్రతకు చిన్నపిల్లలు, వృద్ధులు, బస్టాండ్లు, రహదారులపై యాచకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తెల్లవారు జామున వాకింగ్‌కు వెళ్లే జనం, పాల వ్యాపారులు, పేపర్ బాయ్స్, మునిసిపల్ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## స్కూల్‌పై తెగిపడ్డ హైటెన్షన్ వైర్లు

### ఆందోళనకు దిగిన స్థానికులు

హైదరాబాద్-ప్రభాత సూర్యుడు: ఖైరతాబాద్‌లోని శ్రీనగర్ కాలనీ సబ్ స్టేషన్ ముందు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎల్లారెడ్డిగూడెంలో హై టెన్షన్ కరెంటు వైర్లు ప్రభుత్వ స్కూల్‌పై తెగిపడ్డాయి. వైర్లు పడిన స్థలంలో విద్యార్థులు ఎవరు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. దీంతో జనవాసాల మధ్య నుంచి 34 కెవి హై టెన్షన్ లైన్ తొలగించాలని స్థానికులు ధర్నాకు దిగారు. శ్రీనగర్ కాలనీ సబ్ స్టేషన్ ముందు స్థానికులు ఆందోళన చేపట్టారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. సోమాజిగూడ కాంగ్రెస్ కార్పొరేటర్ స్థానికులతో కలిసి ఆందోళనకు దిగారు.

# ఈ నెల 6 నుండి 19 వరకు బీసీ కుల గణన సర్వే

మొదటి పేజీ తరువాయి...

అన్ని రాజకీయ పార్టీలు కూడా బిసి కులగణన ను జపం చేస్తూ ఆహ్వానించాల్సిన పరిస్థితికి నెట్టపడ్డాయి. ఇంతవరకు అంత బాగానే ఉన్నది. ఇక్కడే తెలంగాణ ప్రభుత్వం యొక్క శీలం ను పరిక్షించాల్సి ఉంటుంది. ప్రభుత్వాలు పేదల కోసమే ఏర్పడ్డాయి అని చెప్పుకుంటూ పేదల కోసం అంటూ ఒక ఉచిత తాయాలా పథకాన్ని ప్రవేశ పెట్టి మహా ఆర్భాటంగా ఎన్నో కోట్లు ఖర్చు పెట్టి ప్రకటనలు ఇస్తూ, ఊరు వాడ లలో సభలు, సమావేశాలు పెట్టి ఎంతో అట్టహాసంగా ప్రచారం చేసుకునే ప్రభుత్వాలు ఈ బిసి కుల గణన సర్వే విషయంలో కూడా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కూడలిలో, నాలుగు రోడ్ల చౌరస్తాలో, టీవీలలో, గ్రామాలలో డప్పుల చాటింపుల తో, ధూమ్ ధామ్ సాంస్కృతిక కార్యక్రమాలతో కవులు, కళాకారులను భాగస్వామ్యాలను చేసి బిసి కుల గణన సర్వేలలో బీసీలు చురుకుగా పాల్గొనాలని, వచ్చే సర్వే అధికారులకు సహకరించాలని, ప్రకటనల రూపంలో అధికారికంగా ప్రభుత్వం ప్రచారం చేయాల్సిన అవసరం ఉన్నది. నిరక్షరాశులు అధికంగా ఉన్న బీసీలను అజ్ఞానులను, విజ్ఞానులుగా చేసిన ప్రభుత్వం గా బీసీ కులాలలో సానుభూతిని పొంది, ప్రభుత్వ ఖాతాలో బీసీల సానుభూతి పొందవచ్చు. నిజమైన బీసీల సంఖ్య ఎంత అన్న విషయం అధికారికంగా మనకు తెలుసుకోవడానికి సులువుగా ఉంటుంది. పెద్ద పెద్ద ప్రకటన ఫ్లెక్సీలను, అదే స్థాయిలో ప్రకటనలు ఇస్తూ, బీసీ వర్గాల సమావేశాలు, సభలు పెట్టి జరుగుతున్న బీసీ కుల గణన సర్వేలో రాష్ట్రంలోని బీసీ సమాజమంతా అట్టి కుల గణన సర్వేలో భాగస్వాములు కావాలని, సర్వే వల్ల బిసి వర్గాలకు రాజ్యాంగపరమైన ఫలాలు రానున్నాయని తెలుపుతూ, ప్రచార మాధ్యమాల ద్వారా బిసి కులగణన సర్వే ను ప్రభుత్వ పరంగా ప్రచారము చేయాల్సిన అవసరం ఉన్నది. బీసీ సంఘాల పెద్దలమని చెప్పుకునే బీసీ వర్గాల నాయకులు ప్రచారంలో భాగస్వామ్యము అవుతూ,సర్వేల నిర్వహణను ఒక కన్నుతో కనిపెట్టాల్సిన అవసరం ఉన్నది. బీసీ సంఘాలు కుల గణన



సర్వే లో బీసీలు అందరూ స్వచ్ఛందంగా పాల్గొని బీసీల ఐక్యత చాటుతూ, నిజంగా తమ జనాభా ఎంత ఉన్నది??? అనే విషయాన్ని ప్రపంచానికి తెలిపాల్సిన అవసరం బిసి నాయకులకు ఉన్నది. బీసీ సేవాదళ్ సభ్యులు, సంఘాల ప్రతినిధులు ఒకరి ఒకరు సహకరించుకుంటూ బీసీ కుటుంబాల గడప గడపకుపోయి పెద్ద ఎత్తున బీసీ సమాజమంతా బిసి కులగణన సర్వేలో బీసీ ప్రజలను పాల్గొనే విధంగా ఆయా నాయకులు చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉన్నది. ఏది ఏమైన తెలంగాణ రాష్ట్రంలోని వెనకబడిన తరగతుల కులాలకు ఇది ఒక చక్కటి అవకాశం గాచూడాలి. ప్రస్తుతం రాజ్యాంగ ప్రకారం రిజర్వేషన్లను పొందుతున్న బీసీ యువత కులగణన సర్వేలో క్రియాశీలక పాత్ర పోషించి, కులగణన సర్వే యొక్క ప్రాముఖ్యతను ఆయా బిసి కులాల ప్రజలకు తెలిపి, తమ తమ ఇంటి వద్దకు వచ్చే సర్వే అధికారులకు సహకరించి, సంపూర్తి సమాచారాన్ని ఇవ్వాలని రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ప్రచారం చేయాల్సిన అవసరం బీసీ యువతకు ఎంతైనా ఉన్నది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రభుత్వపరంగా నిర్వహిస్తున్న బీసీ కుల గణన సర్వేను విజయవంతం చేసి, తెలంగాణ ప్రాంతంలోని గ్రామీణ ప్రజలకు అర్థమయ్యేటట్టు పారదర్శకంగా ప్రతిదీ పబ్లిక్ డొమైన్లో పెట్టాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వ అధికారులపై, ప్రభుత్వం పై ఉన్నది అన్న సంగతి ప్రభుత్వ పెద్దలు గుర్తించాల్సిందిగా ప్రభాత సూర్యుడు పత్రిక సైతం కోరుకుంటుంది. ఇదే విషయమై ప్రభాత సూర్యుడు పత్రిక తెలంగాణలోని బీసీ మేధావులతో మాట్లాడిన అంశాలు సైతం ప్రభుత్వం ముందు ఉంచుతున్నాం.

## "తెలంగాణ రాష్ట్ర బీసీలంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైనది"

### కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ దినేష్



తెలంగాణ రాష్ట్ర విద్య విద్యావంతుల వేదిక చైర్మన్,ప్రొఫెసర్ డాక్టర్ దినేష్ కుమార్

తెలంగాణ రాష్ట్ర బీసీలంతా ఏకమయ్యే సమయం ఆసన్నమైనదని వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్,తెలంగాణ విద్యావంతుల వేదిక చైర్మన్ డాక్టర్ దినేష్ కుమార్ ప్రభాత సూర్యుడుతో మాట్లాడుతూ అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న బీసీ కుల గణనను స్వాగతీస్తున్నామని అన్నారు. బీసీలలో అణగారి ఉన్న అన్ని కులాలకు బీసీ కుల గణన సర్వే ఒక అక్షయపాత్రలాంటిదని అన్నారు. 6 నుండి జరిగే కుల గణన సర్వేలో సమస్త తెలంగాణ బిసి సమాజం పాల్గొని సర్వే అధికారులకు సహాయ సహకారాలు అందిస్తూ అధికారులను ఆదరించాలని అన్నారు. విద్యావంతులైన సర్వే అధికారులను నియమించాలని అన్నారు. సర్వే పారదర్శకంగా జరగాలని అన్నారు. నిర్వహించిన ఈ బీసీ సర్వే రిపోర్టును పబ్లిక్ డొమైన్ లో ఉంచాలని అన్నారు. ఏది ఏమైనా రేవంత్ రెడ్డి సర్కార్ను గౌరవిస్తూ ఆదరిస్తున్నామని అన్నారు.



రేవంత్ రెడ్డి సర్కార్ తీసుకున్న బీసీ కులగనన సర్వేను స్వాగతిస్తున్న హైకోర్టు న్యాయవాదులు చిత్రంలో మామిళ్ళ కిషన్

## కులగణన బీసీలకు ఓ వరం

### హైకోర్టు న్యాయవాది- మామిళ్ళ కిషన్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న బీసీ కులగణన యావత్తు బీసీ సమాజానికి ఒక వరము లాంటిదని హైకోర్టు న్యాయవాది, తెలంగాణ ఉద్యమ కారుడు మామిళ్ల కిషన్ అన్నారు. కుల గణన విషయమై ప్రభాత సూర్యుడు తో మాట్లాడుతూ రేవంత్ రెడ్డి సర్కారు బీసీ కులగణన సర్వేను బీసీ న్యాయవాదులుగా స్వాగతిస్తున్నామని అన్నారు. ఇన్నేళ్ల వెనుకబడి తరగతుల కళ సాకారం కానున్న దని అన్నారు. బీసీ బంధువులందరూ జరగబోయే సర్వేలో పాల్గొనాలని కోరాడు.

## రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ గణన సర్వేలో బిసి సంచార జాతులే కీలకం

### బర్లమణి మనీ మంజరి సాగర్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 19 వరకు బీసీ కులగణన సర్వేను రాష్ట్ర బీసీ మహిళ అధ్యక్షురాలిగా స్వాగతిస్తున్నానని బర్లమణి మనీ మంజరి సాగర్ తెలిపారు. బీసీ కులగనన చేయాలని రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా ఎన్నో మార్గాలలో ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చామని అన్నారు. తప్పని పరిస్థితుల్లో కోర్టులను ఆశ్రయించి కోర్టు ఉత్తర్వులతో ప్రభుత్వం దిగివచ్చి బీసీ కుల గణనకు సిద్ధమైందని అన్నారు. బీసీ కులగణాలలో ముఖ్యంగా సంచార జాతి బీసీ కులాలపై సర్వే అధికారులు దృష్టి పెట్టాలని అన్నారు. బీసీ సోదరి, సోదరీమణులు ఈ చక్కటి అవకాశాన్ని ఉపయోగించుకొని జనాభాలో బీసీల శాతం 52 శాతం పైనే అన్న విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలపాలంటే బీసీ కుల గణన సర్వేలో అందరూ భాగస్వామ్యమై బీసీ కుల గణన సర్వేను జయప్రదం చేయాలని రాష్ట్ర బీసీ మహిళా అధ్యక్షురాలు బీసీ కులాల పెద్దలను కోరారు. - తెలంగాణ రాష్ట్ర బీసీ మహిళ అధ్యక్షురాలు బార్లమని మంజరి సాగర్

## బిజెపి రాష్ట్రాల్లో చీకట్లు.. మా రాష్ట్రంలో వెలుగులు

మొదటి పేజీ తరువాయి...

దుష్పరిపాలన పోయి ప్రజల్లో సంతోషం వెల్లివిరిసిందన్నారు. బాధ్యతలు స్వీకరించిన రెండు రోజుల్లోనే, తెలంగాణ ప్రభుత్వం మొదటి, రెండవ వాగ్దానాన్ని నెరవేర్చింది. అన్ని టీజీఎస్ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద 10 లక్షల ఆరోగ్య సంరక్షణ, ఆసుపత్రి కవరేజీని విడుదల చేసింది. గత 11 నెలల్లో తెలంగాణాలోని సోదరీమణులు, తల్లులు ఒక్క రూపాయి కూడా చెల్లించకుండా ప్రయాణించారు. రాష్ట్రవ్యాప్తంగా 101 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. ఒక సంవత్సరంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కోసం 3,433.36 కోట్లు ఖర్చు చేశాం. మా మొదటి సంవత్సరం పూర్తి కాకముందే, మేము రైతులకి భరోసా ఇస్తూ రైతు రుణమాఫీని అమలు చేశాం. 22 లక్షల 22 వేల మంది రైతులు ఇప్పుడు ఎలాంటి రుణం లేకుండా, రాజులా జీవిస్తున్నారు. రూ. 2,00,000 వరకు రైతుల రుణాలన్నీ మాఫీ చేయబడ్డాయి. 25 రోజుల్లో 18 వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశాం' అని సీఎం చెప్పుకొచ్చారు. ఇళ్లకు 200 యూనిట్ల వరకు గృహ విద్యుత్ ఛార్జీ లేకుండా ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. దీంతో మహిళలు మమ్మల్ని ఆశీర్వదిస్తున్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు ఎక్కువగా ఉంటే, కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో కేవలం రూ.500 కే సిలిండర్ లభిస్తుండడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మా హయాంలో ఇప్పటివరకు 1.31 కోట్లకు పైగా గ్యాస్ సిలిండర్ రీఫిల్‌లు జరిగాయి. 42,90,246 మంది లబ్దిపొంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు. యువత కోసం ఉద్యోగ నియామకాలను చేపట్టాం. కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించింది. అన్ని స్థాయిల పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహిస్తోంది. గ్రూప్ 1, 2, 3, 4 పరీక్షలను 11 నెలల కంటే తక్కువ సమయంలో నిర్వహించి, కాంగ్రెస్ ప్రభుత్వం 50,000 మంది అర్హులైన యువతకు ఉద్యోగాలు కల్పించింది. ఇది ఏ బీజేపీ రాష్ట్ర ప్రభుత్వం చేయని రికార్డు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దశాబ్ద కాలంగా పాఠశాల విద్యార్థులను విస్మరించింది. దశాబ్దం తర్వాత సంక్షేమ హాస్టళ్లలో పేద పిల్లలకు మెస్, కాస్మోటిక్ చార్జీలను 40 శాతానికి పైగా పెంచాం. గతంలో నిర్లక్ష్యానికి గురైన మూసీ నదిని శుభ్రం చేసి పునర్వైభవం తీసుకొస్తున్నాం. గత 10 ఏళ్లలో ఆక్రమణలకు గురై, ధ్వంసం చేసిన మా సరస్సులు, నాలాలు విలువైన నీటి వనరులను కూడా మేము పరిరక్షిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక్క అంగుళం సరస్సు కూడా ఆక్రమణకు గురికాలేదు. అలాగే మేము ఫ్యూచర్ సిటీని రూపొందిస్తున్నాం. మేము యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, జవి స్పోర్ట్స్ యూనివర్శిటీ, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల కోసం బాల్ రోలింగ్‌ను సెట్ చేశాం. ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానంపై పవిత్రమైన నిబద్ధతతో ఉన్నామని రేవంత్‌రెడ్డి తెలిపారు.గత 11 నెలల్లో మేము తెలంగాణలో చీకట్లను పారద్రోలి వెలుగులను నింపాం' అని రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్టు చేశారు.ప్రధాని మోదీ విమర్శలకు 'ఎక్స్' వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి సమాధానమిచ్చారు.



## సాగర్‌లో పర్యాటక శోభ

### శ్రీశైలం వరకు లాంచీ ప్రారంభం

నాగార్జునసాగర్-ప్రభాత సూర్యుడు: తెలంగాణ ప్రకృతి పర్యాటకులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం వరకు అద్భుత బోటు ప్రయాణాన్ని కార్తీక మాసం తొలిరోజు శనివారం పర్యాటకశాఖ ప్రారంభించింది. గత ఐదేళ్లుగా ప్లాన్ చేస్తున్నప్పటికీ నాగార్జునసాగర్ డ్యాం లో సరైన మట్టంలో నీటి లభ్యత లేకపోవడం, కరోనా మహమ్మారి తదితర కారణాలవల్ల వాయిదా పడుతూ వచ్చింది. ప్రస్తుత వర్షాకాల సీజన్లో విస్తృతస్థాయిలో వర్షాలు పడడం వల్ల కృష్ణానది తీరం వెంట, అటు శ్రీశైలం నుండి ఇటు నాగార్జునసాగర్ డ్యాం వరకు గరిష్ట మట్టంలో నీటి లభ్యత ఉండటం వల్ల రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ నాగార్జునసాగర్ నుండి శ్రీశైలం వరకు ఈ బోట్ ప్రయాణాన్ని ప్రారంభించింది. దాదాపు 120 కిలోమీటర్ల దూరం ఉండే ఈ లాంచ్ ప్రయాణానికి మొట్టమొదటి రోజున తెలంగాణ రాష్ట్రం తో పాటు పరిసర రాష్ట్రాల నుండి కూడా పెద్ద ఎత్తున పర్యాటకులు వచ్చారు. నాగార్జున సాగర్ నుంచి నందికొండ మీదుగా ఏలేశ్వరం, సలేశ్వరం, తూర్పు కనుమలు, నల్లమల అటవీ ప్రాంత అందాలను వీక్షించేలా లాంచీ ప్రయాణానికి పర్యాటక శాఖ శ్రీకారం చుట్టింది. మరొక మార్గంలో నాగర్ కర్నూల్ జిల్లా సోమశిల నుంచి శ్రీశైలం వరకు లాంచీ సేవలను కూడా పర్యాటకాభివృద్ధి సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది. కొల్లాపూర్ మండలం సోమశిల తీరంలో 120 మంది ప్రయాణించేలా ఏసీ లాంచీని అధికారులు ప్రారంభించారు. అక్కణ్నుంచి శ్రీశైలం వరకు 120 కిలోమీటర్ల మేర 7 గంటలపాటు ఈ ప్రయాణం ఉంటుంది. లాంచీ ప్రయాణానికి పెద్దలకు రూ.2 వేలు, పిల్లలకు రూ.1,600గా టికెట్ ధరలు నిర్ణయించారు. నాగార్జునసాగర్ డ్యాంలో నీటి మట్టం 575 అడుగులు ఉన్నంత వరకు, ప్రయాణికుల రద్దీని బట్టి శ్రీశైలానికి లాంచీలు నడపనున్నట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ తెలిపింది. శ్రీశైలంలో రూమ్, ట్రాన్స్ పోర్ట్ వంటికి ఎవరికి వారే భరించాల్సి ఉంటుంది.

## అద్భుతమైన స్కీములకు స్కాములుగా ముద్ర

మొదటి పేజీ తరువాయి...

తమదని వెల్లడించారు. తెలంగాణలో ఉన్న డిమాండ్ తగ్గట్టుగా ఇక్కడే మాంసం, పౌల్ట్రీ ఉత్పత్తులు పెంచే ప్రయత్నం చేశామన్నారు. ఇతర రాష్ట్రాలనుంచి ప్రతినిత్యం వచ్చే వందలాది లారీల దిగుబడికి గత పదేండ్లలో క్లళెంవేశాని చెప్పారు. ప్రతి ఆలోచన వెనక ఒక సుదీర్ఘ అధ్యయనం ఉందని, కేసిఆర్ లక్ష్యం ఆరోగ్య తెలంగాణ నిర్మాణమని స్పష్టం చేశారు. నేడు గొర్లు, చేప పిల్లల పంపిణీని నిలిపేసి కుల వృత్తులను రూపుమాపే కుట్రలు చేస్తున్న పాలకులారా కేంద్ర లెక్కలు చూసైనా బుద్ధి తెచ్చుకోవాలంటూ ఎక్స్ వేదికగా సూచించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఎమర్జెన్సీ రోజులొచ్చాయని కేటీఆర్ అన్నారు. ప్రజాస్వామిక తెలంగాణలో మరోసారి ఎనుకటికాలంలా బూటుకాళ్ల శబ్దాలతో తెల్లవారే రోజులొచ్చాయని విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రశ్నిస్తే కేసులు పెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హక్కులను అడిగితే బెదిరింపులకు పాల్పడుతారని, పోరాడితే సస్పెన్షన్లు చేస్తారని మండిపడ్డారు. ఇది నియంతృత్వ రాజ్యమని, ప్రభుత్వం నిర్బంధాన్ని నిర్మిస్తున్నదని చెప్పారు. పోరాటం తెలంగాణకు కొత్తకాదని, ఈ మట్టి పొత్తిళ్లలోనే పోరాటం ఉన్నదని తెలిపారు. ఆ సహజత్వాన్ని ఎత్తిపడుతూ నిర్బంధాన్ని ఎదురిస్తామని, ప్రజాస్వామిక తెలంగాణ పునరుద్దరణకై పోరాడుతామని చెప్పారు. హైదరాబాద్‌లో 144 సెక్షన్ అమలులో ఉండగా, 13 జిల్లాల్లో అధికారికంగా, 20కిపైగా జిల్లాల్లో అనధికారికంగా కాంగ్రెస్ ప్రభుత్వం పోలీస్ యాక్టను అమలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో కేటీఆర్ ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.

## 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

మొదటి పేజీ తరువాయి...

ఆమోద ముద్ర పడే అవకాశం ఉంది. 'వన్ నేషన్, వన్ ఎలక్షన్' ప్రతిపాదన, వక్ఫ్ సవరణ బిల్లు.. ప్రధానంగా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ఈ రెండు అంశాల చుట్టూనే వాడీవేడిగా సాగనున్నాయి. 'వన్ నేషన్ -వన్ ఎలక్షన్' ప్రతిపాదనకు కేంద్ర కేబినెట్ ఇప్పటికే ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. జమిలి ఎన్నికలపై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం 18 రాజ్యాంగ సవరణలను ఈ హైలెవల్ కమిటీ సిఫార్సు చేసింది. కాగా, వన్ నేషన్ వన్ ఎలక్షన్‌ను ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. పార్లమెంట్‌లో బిల్లును అడ్డుకుంటామని 15 విపక్ష పార్టీలు ఇప్పటికే హెచ్చరించాయి.దేశంలోని ఓటర్లు అందరూ లోక్ సభ, అసెంబ్లీ, స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఒకేసారి ఓటు హక్కును వినియోగించు కోవడం. కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రతినిధులను ఎన్నుకునేందుకు ఒకే సమయంలో కాకపోయినా... ఒకే ఏడాదిలో ప్రజలు ఓటేస్తారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## ప్రైవేట్ పాఠశాలలో బాలుడు
# అనుమానాస్పద మృతి

**సంగారెడ్డి-ప్రభాత సూర్యుడు:** జహీరాబాద్‌లోని ప్రైవేట్ పాఠశాలలో ఓ బాలుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పాఠశాల వసతి గృహంలో బాలుడి (12) మృతదేహాన్ని గుర్తించారు. అతడి తల, పెదవులు, కనుబొమ్మలపై గాయాలున్నాయి. హాస్టల్‌లోని మంచంపై నుంచి పడి మృతి చెందాడని పాఠశాల యాజమాన్యం చెబుతోంది. జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థి మృతిపై తల్లిదండ్రులు, బంధువులు ఆందోళన చేపట్టారు. ఈ ఆందోళనల్లో విద్యార్థి సంఘాలు కూడా పాల్గొన్నాయి.

## ప్రజాపాలన అంటే
# ప్రతిపక్షం గొంతు నొక్కడమా?

**ప్రశ్నిస్తే కేసులు పెట బెదిరిస్తారా**
**శ్రీనివాస్ గౌడ్ తదితరులపై**
**కేసులు దారుణం**
**ప్రభుత్వ తీరుపై మండిపడ్డ హరీష్ రావు**



**హైదరాబాద్-ప్రభాత సూర్యుడు:** ప్రజాపాలన అంటే ప్రజా సమస్యల పట్ల పోరాటం చేస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కడమేనా అని సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులకు కేసులు కొత్త కాదని, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా, అక్రమ కేసులు పెట్టినా ప్రజల తరుపున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటా మని స్పష్టం చేశారు. ప్రజల కోసం పోరాటం చేస్తూనే ఉ ంటామన్నారు. తమ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌తోపాటు బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టడాన్ని హరీశ్ రావు తీవ్రంగా ఖండించారు. పేదల ఇండ్లు ఎందుకు కూలగొట్టారని ప్రశ్నించినందుకు కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం హేయమైన చర్య అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనపై తన కుటుంబ సభ్యులతోపాటు పార్టీ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టినంత మాత్రానా భయపడేది లేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడ మండల కేంద్రంలో 60, 70 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై కేసులు పెట్టేందుకు జాబితాలు సిద్ధం చేసినట్టు తెలిసిందని ఏ ఒక్కరూ భయపడవద్దని మీకు అండగా మేమున్నామని భరోసా ఇచ్చారు. వరద భాస్కర్ ఇంటికి పోతే అతనిని పోలీస్ వాళ్లు కొట్టారని బాధపడితే అడుగుదామని పోతే సీఐ లేరంటే కింద కూర్చున్నాం.. దానికి కూడా కేసు నమోదు చేసారా అంటూ ప్రశ్నించారు. కూలగొట్టిన దివ్యాంగుల ఇండ్లను కట్టివ్వమని కోరినం అదికూడా తప్పా అని ప్రభుత్వాన్ని నిలదీశారు. అప్పన్నపల్లి బ్రిడ్జి నిర్మాణం రెండేండ్లలో పూర్తి చేశాం, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని పెద్ద దవాఖాన నిర్మాణం చేశాం. వీటిపై అసత్య ప్రచారాలతో ఎన్నికల్లో ఓడించారు. ఇప్పటికీ అదే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా.. పేదల పక్షాన అడుగుతున్న వారిపై తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమాల్లో అనేక కేసులు నమోదు చేసినా జంకలేదు. ఇప్పుడు మీరు పెట్టే కేసులకు బెదిరిపోతామా.. మీ బండారాన్ని బయటపెట్టేందుకు ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రజలకు వివరిస్తామన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అధికారులు, పోలీసులు కూడా గుర్తెరిగి ప్రవర్తించాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు.

## సారూ తీగలాగండి డొంక కదులుతుంది

**అవినీతి అక్రమాలకు నిలయం కల్లూరు సొసైటీ**
**అందిన కాడికి దండుకున్న అధికారి**
**సర్వీస్ రికార్డు మాయం**
**అధికారుల ఆడిట్లు బట్టబయలు**
**ఆరోపణలు గుప్పిస్తున్న డైరెక్టర్లు**
**డైరెక్టర్ కిష్టం శెట్టి నరసింహారావు**



**కల్లూరు -ప్రభాత సూర్యుడు**

సారూ..

తీగలాగండి డొంక కదులుతుంది కల్లూరు సొసైటీలో చక్రం తిప్పుతున్న సీఈవో శ్రీనివాసరావు సొసైటీలో ఇస్తారాజ్యంగా సీఈఓ వ్యవహరించడం పలు ఆరోపణ వెల్లు వెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్ర జిల్లా ఉన్నతాధికారులు చేత 51 ఎంక్వయిరీ చేపడితే తప్ప అనేక అవినీతి విషయాలు వెలుగు చూసే అవకాశం ఉందని సొసైటీ డైరెక్టర్ కిష్టం శెట్టి నరసింహారావు అంటున్నారు.ఇక్కడ ఆయన సొంత రాజ్యం అమలు అవుతుంది ఆయన ఆడిందే ఆట... పాడిందే పాట తప్ప అధికారుల నిబంధనలు ఇక్కడ మచ్చుకైనా కూడా పనిచేయడం లేదని తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎవరైనా ప్రశ్నిస్తే నోట్ల కట్టలు ఎరవేసి కట్టడి చేయడంలో దిట్టా అవినీతికి అక్రమాలకు నిలయముగా సహకార సంఘాలు అడ్డాగా మారాయని ఎవరి చేతివాటం వారు చూపుతూ అందిన కాడికి దండుకొని ప్రయత్నాలు కొనసాగాయని మండలంలో సొసైటీ డైరెక్టర్లే బహిరంగ ఆరోపణలు గుప్పిస్తున్నారు.మండలంలో కల్లూరు సొసైటీ ఇటువంటి ఆరోపణలు ప్రస్తుతం ఎదుర్కొంటున్నట్లు తెలుస్తుంది.గత ప్రభుత్వంలో రైతుల వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసి జరిగిన వ్యాపారం ద్వారా సహకార సంఘానికి కమిషన్ ఇవ్వడం జరుగుతుంది. అందులో సొసైటీ సిబ్బందికి 10 శాతం కమిషన్ పంచడం జరుగుతుంది.కానీ సొసైటీ చైర్మన్, సీఈఓ చేతివాటం ప్రదర్శించి సిబ్బందికి డబ్బులు ఇవ్వలేదని ఆరోపణలు వచ్చాయి.సొసైటీ ఎన్నికల్లో ఐదవ వార్డు బిసి రిజర్వేషన్ ఉండగ ఉద్దేశపూర్వకంగానే బీసీ కులస్తులను ఓసీ కులస్తులుగా చిత్రీకరించి ఎన్నికలు నిర్వహించారని వాదన ఉంది. సొసైటీ ఎన్నికలకు సహకరించిన సొసైటీ సిబ్బంది ఒకరు ఎటువంటి అర్హతలు లేకపోయినా సీఈఓ గా ఎన్నుకొని హడావుడిగా పదోన్నతి కల్పించారని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది.అదే సొసైటీలో అన్ని అర్హతలు ఉండి గత ఆరేడు సంవత్సరాలుగా పనిచేస్తున్న సొసైటీ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించేందుకు 2019 ఫిబ్రవరి లోపు సొసైటీలో కొనసాగిన సిబ్బందిని రెగ్యులర్ చేసేందుకు తీర్మానాలు పంపించమని సహకార సంఘాలకు జీవో 44 జారీ చేయగా సొసైటీ చైర్మన్ సీఈఓ నిర్లక్ష్యం వలన ఉద్యోగాలు కోల్పోయామని సొసైటీ సిబ్బంది ఆవేదన వ్యక్తంచేశారు. సొసైటీలో సర్వీస్ రికార్డులను హడావుడిగా ఏడు సంవత్సరాల రికార్డును ఒకేరోజు ఒకే వ్యక్తితో రాయించారని రికార్డు పరమైన ఆధారాలున్నాయని తెలియజేశారు. సొసైటీలో అవినీతి అక్రమాలపై సొసైటీ డైరెక్టర్ కృష్ణ శెట్టి నరసింహారావు తెలంగాణ రాష్ట్ర రిజిస్టర్ ఆఫ్ కోపరేటివ్ సొసైటీ హైదరాబాద్ వారికి ఫిర్యాదు చేశారు . ఉన్నతాధికారి ఆదేశాలతో హడావుడిగా గుట్టు సప్పుడు కాకుండా అధికార యంత్రాంగం కాసులకు కక్కుర్తి పడి విచారణకు వచ్చిన అధికారులు తూతు మంత్రంగా నిర్వహించారని ఆరోపణ చేశారు. పలు అవినీతి ఆరోపణపై సాక్షాధారాలతో నిరూపించిన అధికార యంత్రాంగం ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దురదృష్టకరమని ఇంతకంటే దౌర్భాగ్యం పరిస్థితి ఉండదని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. తీగ లాగితే డొంక కదులుతుందని సామెతగా మరెన్నో ఆశ్చర్యకరమైన అవినీతి అక్రమాలు వెలుగు చూశారని సమాచారం ఉన్న అధికారులు నిమ్మకి నీరెత్తినట్లు వ్యవహరించటం ఇంటి దొంగలను కాపాడే ప్రయత్నం జరిగిందని బహిరంగ ఆరోపణలు గుప్పించారు. సర్వీస్ రికార్డు విషయంలో గతంలో పనిచేసిన చైర్మన్, సీఈఓ ల ద్వారా సర్వీస్ రికార్డ్ తయారు చేయబడిన వాటిని లేకుండా చేసి తన సొంతగా ఏడు సంవత్సరాల రికార్డును ఒకే వ్యక్తితో ఒకే సిరాతో ఒకేరోజు రాసినట్లు పలు ఆరోపణలు చేసిన అధికారులు ఎటువంటి అవినీతి తెల్సుకుండా దాచి పెట్టడం ఎంతవరకు సమంజసం అని ఆయన అధికార యంత్రాంగం ను ప్రశ్నించారు.పాడి కమిషన్లో వచ్చిన సుమారు 12 లక్షల రూపాయలు సిబ్బందికి ఇవ్వకుండా చేతివాటం ప్రదర్శించారని పలు అవినీతి అక్రమాలపై ఆరోపణ చేశారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి సమగ్ర విచారణ 51 ఎంక్వయిరీ వేసి నిజ నిజాలు రాబట్టి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని సొసైటీలను కాపాడాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రచారం కోసమే
# తెలంగాణ సీఎం మార్పు

**సంక్రాంతి ముందు సర్పంచ్ ఎన్నికల నిర్వహణ**
**ఇందిరమ్మ ఇళ్ల కోసం అడుగులు వేస్తున్నాం**
**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టీకరణ**



**హైదరాబాద్-ప్రభాత సూర్యుడు:** తెలంగాణలో సీఎం మార్పుపై బిజెఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై అటు కాంగ్రెస్, ఇటు మంత్రులు భగ్గుమన్నారు. ఈ ప్రచారంపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఘాటుగా స్పందించారు. శనివారం మీడియాతో మంత్రి మాట్లాడుతూ... కేవలం ప్రచారం కోసం ఇలాంటి వ్యాఖ్యాలు చేస్తున్నారని కొట్టి పారేశారు. సంక్రాంతి పండగ ముందు సర్పంచ్ ఎన్నికలు జరుగుతాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి త్వరగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇకపోతే తెలంగాణ సీఎం మార్పు ఉండదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వానికి పీరియడ్ ఇంకా నాలుగేండ్ల ఒక నెల ఉందని.. పూర్తి కాలం రేవంత్ రెడ్డినే సీఎంగా ఉంటారని తెలిపారు. ప్రతిపక్షాలు ఏదో ఒకటి మాట్లాడాలి కాబట్టి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఏమైనా చిన్న చిన్నవి ఉంటే అవి టీ కప్పులో తుఫాను మాత్రమే అని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. మంత్రి ఇంకా మాట్లాడుతూ.. త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోస్తామన్నారు. గ్రామ సభలు పెట్టి ఇండ్లను మంజూరు చేస్తామని.. నాలుగు విడతల్లో 5 లక్షలు పేమెంట్ చేస్తామన్నారు. ఫౌండేషన్ లెవల్‌కు లక్ష, లెంటల్ లెవల్‌కు 1.25 లక్షలు, స్లాబ్ లెవల్‌కు 1.75 లక్షలు, పూర్తి అయ్యాక లక్ష చెల్లిస్తామన్నారు. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇంటి నిర్మాణం ఉంటుందన్నారు. సొంత స్థలంలో ఇండ్ల నిర్మాణానికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆ తర్వాత ప్రభుత్వం స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరు చేసి నిర్మాణం మొదలు పెట్టిన ఇండ్లకు కూడా సహాయం చేస్తామన్నారు. ఈ నెల 20లోపు ఇందిరమ్మ కమిటీలు లబ్దిదారుల జాబితాను పంపిస్తాయన్నారు. నెలాఖరుకు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారుల ఎంపిక పూర్తి అవుతుందని వెల్లడించారు. ఆ వెంటనే ఇండ్ల నిర్మాణం ప్రారంభిస్తామన్నారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లకు ఫ్రీ ఇసుక ఇచ్చే అవకాశాలు పరిశీలిస్తామన్నారు. కేంద్ర గృహ నిర్మాణ స్కీం అడాప్ట్ చేసుకుంటున్నామని.. పేద ప్రజలకు అన్యాయం జరగొద్దని కేంద్రం ఎన్ని కండిషన్‌లు పెట్టినా ఒప్పుకుంటున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లపై కేంద్రం లోగో పెట్టుకోవడానికి కూడా ఒప్పుకున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా చెల్లింపులు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజలకు కేంద్ర మంత్రులను ఆహ్వానిస్తామన్నారు. రాష్ట్రంలోని ఇద్దరు కేంద్ర మంత్రులను కూడా ఆహ్వానించనున్నట్లు తెలిపారు. ఉాబోయే నాలుగేళ్లు 20 లక్షల ఇండ్ల నిర్మాణం టా÷-గ్గం÷ట్ పెట్టుకున్నామని.. తల తాకట్టు పెట్టైనా పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. మొదటి విడత ఇండ్లకు 26 వేల కోట్ల భారం ప్రభుత్వంపై పడుతుందన్నారు. తెలంగాణ సీఎంగా ఉన్న రేవంత్ రెడ్డిని వచ్చే ఏడాది మారుస్తారని, ఆయన స్థానంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లేదా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని సీఎం చేస్తారంటూ మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ నేత వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహేశ్వర్ రెడ్డి వ్యాఖ్యల్లో వాస్తవం లేదని కాంగ్రెస్ నేతలు ఖండిస్తున్నారు.



## యూనివర్సిటీలను
# బలోపేతం చేయండి


**స్వేచ్ఛగా పనిచేసి మంచి పేరు తీసుకురండి**
**కొత్తగా నియమితులైన విసిలకు సిఎం రేవంత్ సూచన**

**హైదరాబాద్-ప్రభాత సూర్యుడు:** రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలను సమూలంగా ప్రక్షాళన చేసి.. దెబ్బతిన్న వ్యవస్థలను పునరుద్ధరించాలని కొత్త వైస్‌ఛాన్సలర్లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా యూనివర్సిటీలను బలోపేతం చేసి, విద్యార్థుల్లో భరోసా కల్పించాల్సి ఉందన్నారు. యూనివర్సిటీలపై నమ్మకం పెంచాల్సిన తోణ బాద్యత తీసుకోవాలని అన్నారు. ఇలీవల ఆయా యూనివర్సిటీలకు కొత్తగా నియమితులైన ఉపకుల పతులంతా కలసి హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. కొంతకాలంగా యూనివర్సిటీల పై నమ్మకం తగ్గుతోందని, మళ్లీ విశ్వాసం పెంచేలా పనిచేయాలన్నారు. వ్యవస్థల పునరుద్ధరణకు ఏం చేయాలో అధ్యయనం చేయాలని ఉపకులపతులకు సీఎం సూచించారు. యూనివర్సిటీల్లో ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం కోసం అవసరమైతే కన్‌స్టలెన్సీలను నియమించుకొని నివేదిక తయారు చేసుకోవాలని అన్నారు. ఒత్తిళ్ల ప్రభావంతో వీసీలను నియమించలేదని.. ప్రతిభ, సామాజిక సమీకరణలనే పరిగణనలోకి తీసుకున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. వీసీలు బాగా పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని.. తప్పులు చేస్తే ఆశ్చర్యకరమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు. మంచి పని చేయడానికి వైస్ ఛాన్సలర్లకి స్వేచ్ఛ.. ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. గతంలో వీసీలను విద్యార్థులు ఏళ్ల తరబడి గుర్తు పెట్టుకునే వారని.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సీఎం వ్యాఖ్యానించారు. విశ్వవిద్యాలయాల్లో డ్రగ్స్, గంజాయి విక్రయాలపై దృష్టి పెట్టాలని.. విద్యార్థులను గమనిస్తూ అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని రేవంత్ రెడ్డి సూచించారు.



## కుల గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి
**తహసిల్దార్ ధ్రువ కుమార్**

**చిలుకూరు-ప్రభాత సూర్యుడు** తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 6వ తేది నుండి చేపట్టనున్న కుల గణన సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలని చిలుకూరు మండల తహసిల్దార్ ధ్రువ కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఒకటో వార్డులో కుల గణన సర్వేలో భాగంగా ఇంటి నెంబర్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం సర్వేను పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇంటి నెంబర్ల ప్రకారం ప్రతి ఏన్యూమరేటర్ కు 150 నుండి 175 ఇళ్లు సర్వే చేయనున్నట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఓ అశోక్, ఆర్ఐ మంత్రి ప్రగడ సీతయ్య, గ్రామ కార్యదర్శి షరీపుద్దీన్, ఏన్యూమరేటర్ ఝాన్సీ రాణిలు పాల్గొన్నారు.




## శ్రీ కాళికా అమ్మవారిని దర్శించుకున్న టిపిసిసి ప్రతినిధి లక్ష్మారెడ్డి

**చిలుకూరు-ప్రభాత సూర్యుడు** మండల పరిధిలోని జానకి నగర్ గ్రామంలో శనివారం టిపిసిసి ప్రతినిధి లక్ష్మారెడ్డి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ వంగవీటి రామారావులు శ్రీ కాళికా అమ్మవారి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అతిధులను అమ్ము నాయక్ ను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిలుకూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు. కీత వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి పింద్రాతి హనుమంతరావు, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి మాలోతు సైదా నాయక్, కోదాడ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవ శ్రీధర్ బాబు, చిలుకూరు మండల కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు బర్మవత్ రాజేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

# విషవాయువు లీకై 30 మంది కార్మికులకు అస్వస్థత




**అమరావతి-ప్రభాత సూర్యుడు:** బాపట్ల జిల్లా నిజాంపట్నం మండలం గోకర్ణమఠంలో రాయల్ మెరైన్ రొయ్యల ప్రాసెసింగ్ కంపెనీలో విషవాయువు లీకై 30 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. శనివారం ఉదయం కంపెనీలోని పైపులైన్ నుంచి లీకేజీ ఏర్పడి విషవాయువు వెలువడింది. దీంతో అక్కడే పనిచేస్తున్న సుమారు 30 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతలోనయ్యారు. కార్మికులకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, కళ్లు మండడం , కళ్లు ఎర్రగా కావడంతో వారిని నిజాంపట్నం , పిట్టవానిపాలెం ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం అందించేందుకు బాపట్ల, గుంటూరు ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఒక ప్రాంతంలో మాత్రమే విషవాయువు లీకైందని అగ్నిమాపక సిబ్బంది ప్రాథమిక అంచనాకు వచ్చారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షిస్తున్నారు. విషవాయువు లీకేజీలో యాజమాన్యం నిర్లక్ష్యంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. విషయం తెలుసుకున్న మంత్రి సత్యగాని ప్రసాద్ మాట్లాడుతూ బాధితులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.

# ప్రతిష్టాత్మకంగా మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికలు!



ఈ నెలలోనే పలు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగబోతున్నాయి. అలాగే యూపి, పంజాబ్, వయనాడ్‌లలో ఉప ఎన్నికలు కూడా ఉన్నాయి. ఓ రకంగ చెప్పాలంటే హర్యానా, కాశ్మీర్ ఎన్నికల తరవాత జరుగుతున్న ఈ ఎన్నికలు మోడీకి, రాహుల్‌కు పరీక్ష లాంటివి. అలాగే మహారాష్ట్రలో కూడా ఎన్నికలు బిజెపి కూటమికి సవాల్‌గానే చూడాలి. కాంగ్రెస్ కూటమి అక్కడ బలంగానే ఉంది. ఇకపోతే జార్ఖండ్‌లో కూడా బిజెపి ఎత్తులు వేసి హేమంత్ సోరెన్‌ను ముప్పుతిప్పలు పెట్టింది. కేసుల్లో జైలుకు తోసింది. తిరిగి బయటకు వచ్చాక కూడా స్థిరంగా పాలన చేసుకునే పరిస్థితి లేదు. ఈ నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగ నున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఈఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. మహారాష్ట్రలోను, విశాల భాతదేశంలోను ప్రజలంతా ఇక్కడి ఎన్నికలపై ఆసక్తిగా చూస్తున్నారు. 'లడ్కీ బహిన్' పేరుతో ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలు పరుస్తున్న 'సంక్షేమ' పథకం గట్టెక్కిస్తుందని నమ్మకంగా ఉన్నారు. సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలా నెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హాయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది. తెలంగాణలో కూడా ఎన్నికల ముందు రెండున్నర వేలు ఆడిబడ్డ ఖాతాలో వేస్తామని ఇలాంటి హామీనే ఇచ్చారు. రాష్ట్రాల్లో లేదా కేంద్రం లో మరోమారు అధికారం కోసం ఎన్నికల ముందు ఇలాంటి హామీలు ఇవ్వడం అన్నది సర్వసాధారణంగా మారింది. ఓ రకంగా చెప్పాలంటే క్విడ్‌ప్రోకో లాంటిదే. తాయిలాలు ప్రకటించడం...ఎన్నికల్లో గెలవడం అన్నది కొత్త పరిభాషగా మారింది. బిజెపి కూడా ఇదే కోవలో ప్రయాణం చేస్తోంది. పేదలకు లేదా మహిళలు, లేదా బడుగు బలహీన వర్గాల ఓట్లను గంపగుత్తగా దక్కించుకునేందుకు ఇలాంటి ఎత్తుగడలు వేస్తున్నారు. నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం అన్నది ఎన్నికల్లో జరుగుతూనే ఉంది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర ఎన్నికల్లో ఏక్‌నాథ్ షిండే తన అధికారం నిలుపుకునేందుకు లడ్కీ బహిన్ పథకం తీసుకుని వచ్చారు. ఇలా ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలకు ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మహారాష్ట్ర ప్రభుత్వ రుణభారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా. ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాఢీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయంగా దీనిని చెప్పుకోవాలి. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 ఎంపి సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా ఓటర్ల బృందాలను ఆకట్టుకునే క్రమంలో లడ్కీ బహిన్ పథకాన్ని ఏక్‌నాథ్ షిండే ప్రకటించారు. మహిళలు, యువత లక్ష్యంగా లడ్కీ బహిన్, నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి రాజ్యాంగం ప్రమాదంలో పడిందన్న నినాదంతో బిజెపిని ముచ్చెమటలు పోయించింది. ఈ ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల ప్రధాన ప్రచారాంశంగా చేయడం గమనార్హం. ఇక జార్ఖండ్‌లోనూ ఇండియా కూటమి బాగానే పనిచేస్తోంది. ఇక్కడ సంక్షేమ పథకాల వైపు మొగ్గుతారా? సానుభూతి అంశాలకు పీటవేస్తారా? అన్నది జార్ఖండ్ ఓటర్ల మనోభావాల మీద గెలుపోటములు ఆధారపడ్డాయి. ఇద్దరి అమ్ముల పొదిలోనూ ఈ రెండంశాల విడివిడి అస్త్రాలున్నాయి.

18-50 ఏళ్ల మధ్య వయస్కులైన ప్రతి మహిళకు నెలనెలా వెయ్యి రూపాయలిచ్చే 'మయ్యా సమ్మాన్ యోజన' తో 53 లక్షల మంది లబ్దిదారులు ప్రయోజనం పొందుతున్నారు. దీంతోపాటు 200 యూనిట్లలోపు విద్యుత్ బిల్లుల మాఫీ వల్ల 40 లక్షల కుటంబాలు, వ్యవసాయ రుణాల మాఫీ వల్ల 1.7 లక్షల కుటుంబాలు తమకు సానుకూలంగా ఉన్నారని, వారే ప్రభుత్వాన్ని తిరిగి గెలిపించుకుంటారని జెఎంఎం, 'ఇండియా' నమ్మకంతో ఉంది. దీనికి ధీటుగా బిజెపి కూడా తాయిలాలను ప్రకటించింది. తాము అధికారంలోకి వస్తే ప్రతి మహిళకు కనీస నెలసరి ఆదాయం అందించడం, ఉచిత వంటగ్యాస్, ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి, గృహ సదుపాయం.. 'పాంచ్ ప్రాణ్' అమల్లోకి తెస్తామని బిజెపి ప్రచారం చేస్తోంది. ఇవికాకుండా.. బిజెపి ఆదివాసీ వ్యతిరేక పార్టీ అని, అందుకే ఎస్‌టిలకు ప్రాధాన్యత ఇవ్వకపోగా సిఎం హేమంత్ సోరెన్‌ను అక్రమంగా జైలుపాలు చేసిందని జెఎంఎం ప్రచారం ఉధృతం చేస్తోంది. సరిహద్దుల నుంచి వచ్చే బంగ్లాదేశ్ చొరబాటుదారుల వల్ల స్థానిక ఆదివాసీల ప్రయోజనాలకు తీవ్రభంగం వాటిల్లుతోందని, తాము అధికారంలోకి వస్తే ఈ పరిస్థితిని ఎన్‌ఆర్‌సి అమలుతో కట్టడిచేస్తామని బిజెపి చెబుతోంది. ఈ రెండు రాష్ట్రాల్లోనూ 'ఇండియా' ఎన్‌డిఏ కూటములుగా ముఖాముఖి తలపడుతున్నాయి. తెలంగాణ లాగానే జార్ఖండ్ కూడా పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది. 2000లో బీహార్ రాష్ట్ర విభజన జరిగి, జార్ఖండ్ ఏర్పడింది. 24 ఏళ్లలో ఇది అయిదో ఎన్నిక. నవంబరు 13, 20 తేదీల్లో రెండు విడతలుగా రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగనున్నాయి. నవంబరు 23న ఓట్ల లెక్కింపు. ప్రతి రాష్ట్ర ఎన్నిక లాగానే, జార్ఖండ్ ఎన్నికల్ని కూడా బిజెపి ఎంతో ప్రతిష్మాత్మకంగా తీసుకుంటోంది. మాజీ ముఖ్యమంత్రి చాంపయ్ సోరన్ తో పాటు పలువురు పేరున్న నాయకుల్ని పార్టీలోకి తిరిగి తెచ్చుకుంది. మూడుసార్లు ముఖ్యమంత్రిగా ఉన్న అర్జున్ ముండే ముఖ్యమంత్రి అభ్యర్థి అయ్యే అవకాశాలున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. సోరెన్ లాగే, సంతాలీ అయిన మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ మరాండిని ఏడాది కిందటే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిని చేసింది. ఈ ముగ్గురే కాకుండా మరో మాజీ ముఖ్యమంత్రి మధు కోడా సేవల్ని కూడా ఉపయోగించు కుంటోంది. రెండు నెలల వ్యవధిలో రెండు మార్లు రాష్ట్రంలో పర్యటించిన ప్రధాని నరేంద్ర మోడీ, ఎన్నికల ప్రక్రియ ముగిసే లోపు మరో ఆరేడు సార్లు పర్యటించేలా ప్రచార ప్రణాళిక రచిస్తున్నారు. దానికి తోడు కేంద్ర ఇతర మంత్రులు, పలువురిని ప్రచారంలో మోహరిస్తున్నారు. మొత్తంగా మహారాష్ట్రలో అధికారం నిలబెట్టుకోవడం, జార్ఖండ్‌లో అధికారం దక్కించుకోవడం లక్ష్యంగా బిజెపి పావులు కదుపుతోంది. అయితే ధరల పెరుగుదల, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు బిజెపిని వెన్నాడుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ప్రజలు ఎవరిని ఆదరిస్తారన్నది చూడాలి.

## కరువు మండలాల

# గుర్తింపులో నిర్లక్ష్యం

### అనేక ప్రాంతాలను విస్మరించారన్న విమర్శలు

ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల భారీ వర్షాలే కురిశాయి. నదులు పొంగాయి.. వరదలు బీభత్సం సృష్టించాయి. కృష్ణమ్మ ఇప్పటికీ ఉత్సాహంగా ఉరకలెత్తుతోంది. అయినా పలుచోట్ల ఇంకా వర్షాభావం నెలకొంది. దీంతో పలు కరువు మండలాలను ప్రకటించక తప్పలేదు. ఖరీఫ్ పంట కాలంలో కీలకంగా భావించే జులై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తీవ్ర వర్షాభావం నెలకొనగా ప్రభుత్వం కరువు మండలాలను ప్రకటించింది. గత ఖరీఫ్‌లో 300 మండలాలకు పైన కరువు పరిస్థితులుండగా గత వైసిపి సర్కారు 103 మండలాలలనే గుర్తించింది. వైసిపి ప్రభుత్వం తక్కువ మండలాలను ప్రకటించిందని నాడు ప్రతిపక్షంలో ఉన్న టిడిపి కూటమి విమర్శించింది. నేడు అధికారంలోకొచ్చాక గత ప్రభుత్వ విధానాన్నే కొనసాగించింది. దుర్భిక్షాన్ని అంచనా వేసి బాధితులను ఆదుకునేందుకు ప్రకటించాల్సిన కరువు మండలాలను తగ్గించింది. రాయలసీమలోని ఐదు జిల్లాల్లో కేవలం 54 మండలాల్లోనే కరువును గుర్తించింది. వాటిలోనూ తీవ్ర స్థాయి, మధ్యస్త స్థాయి అని రెండు కేటగిరీలుగా విభజించింది. కరువు మాన్యువల్ ప్రకారం మండలాలను గుర్తించామని సర్కారు చెబుతున్నా వాస్తవంలో అదేమీ కనిపించట్లేదన్న విమర్శలు ఉన్నాయి. సగటు గణాంకాల ప్రకారం సాధారణ వర్షపాతం నమోదైంది. జిల్లాల సరాసరి కూడా అలాగే ఉంది. నెలల వారిగా, మండలాల వారీగా చూస్తేనే వాస్తవం బోధ పడుతుంది. జూన్‌లో జూన్‌లో 61 మండలాల్లో, జులై 210, ఆగస్టు 196, సెప్టెంబర్ 217 మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షం కురిసింది. జులైలో 58, ఆగస్టు 35, సెప్టెంబర్ 68 మండలాల్లో అత్యల్ప (వర్షపులోటు 60 శాతం పైన) వర్షం నమోదైంది. కానీ ప్రభుత్వం ఈ అంశాలను పరిశీలనలోకి తీసుకోలేదు. జూన్-సెప్టెంబర్ వరకు మూడు మాసాల్లో మొత్తం కురిసిన వర్షపాతాన్ని గుర్తించింది. ఆ ప్రకారం జూన్ చివరికి 61, జూలై చివరికి 38, ఆగస్టు చివరికి 38, సెప్టెంబర్ చివరికి 54 మండలాల్లో తక్కువ వర్షం కురిసినట్లు పరిగణనలోకి తీసుకొని, ఆ మేరకే కరువు మండలాలను ప్రకటించినట్లు లెఫ్ట్ పార్టీలు మండిపడుతున్నాయి. కరువు మండలాల గుర్తింపునకు అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. వాటిలో ముఖ్యమైన వర్షపాతంను ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎపిలో 679 మండలాలుండగా ఖరీఫ్ ముగిసే సెప్టెంబర్ నెలాఖరు నాటికి 347 మండలాల్లో వర్షాభావం ఉన్నాయని ప్రభుత్వ నివేదికలున్నాయి. ఉత్తరాంధ్రలో శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కిందికొస్తే బాపట్ల, పల్నాడు మొదలుకొని ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ వ్యాప్తంగా డ్రైస్పెల్ మండలాలు గణనీయ సంఖ్యలో ఉన్నాయి. ఆ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. ఖరీఫ్ పంటల సేద్యానికి, తొలకరి వానలకు సాగు చేసిన పంటల ఎదుగుదలకు

జులై, ఆగస్టు, సెప్టెంబర్ అత్యంత కీలకం. సరిగ్గా అప్పుడే పలు మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొన్నాయి. జులై చివరికి 113 మండలాల్లో డ్రైస్పెల్స్ వచ్చాయి. ఆగస్టు ఆఖరికి 244 మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొనగా 234 మండలాల్లో సింగిల్, పది మండలాల్లో డబుల్ డ్రైస్పెల్స్ వచ్చాయి. సెప్టెంబర్ చివరాఖరికి 347 మండలాల్లో డ్రైస్పెల్స్ నెలకొన్నాయి. అప్పటికి 242 మండలాల్లో సింగిల్, 102 డబుల్, మూడు మండలాల్లో ట్రిపుల్ డ్రైస్పెల్స్ నెలకొన్నాయి. రాయలసీమలో మొత్తం 249 మండలాలుండగా ఖరీప్ చివరాఖరికి 180 మండలాల్లో డ్రైస్పెల్స్ ఉన్నాయి.

# జార్ఖండ్‌లో పొత్తులే కీలకం

### గిరిజన రాష్ట్రంలో పట్టు కోసం పోరాటం
### కాంగ్రెస్ కూటమితో పటిష్టంగా జెఎంఎం
### మరోమారు
### అధికారం కోసం బిజెపి యత్నం



రాంచీ,నవంబర్1(ఆర్ఎన్ఎ):ఒకప్పుడు కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న జార్ఖండ్‌లో ఇప్పుడు పాలక జెఎంఎం సహకారం లేకుండా ఏమీ చేయలేని స్థితిలోకి కాంగ్రెస్ పార్టీ వెళ్లిపోయింది. సర్ఫరాజ్ అహ్మద్, సుబోధ్ కాంత్ సహాయ్, ఫుర్కాన్ అన్సారీ, రాజేందర్ సింగ్, చంద్రశేఖర్ దూబే వంటి నాయకులతో కలకలలాడిన కాంగ్రెస్ ఇప్పుడు బలం తగ్గిఉంది. పొత్తులు ఫలించడం, సంక్షేమ పథకాలు సానుకూలించడంతోపాటు సోరెన్ అరెస్టుతో రాష్ట్రంలో వ్యక్తమైన సానుభూతి పాలక 'జెఎంఎం', 'ఇండియా' కూటమికి కలసి వస్తోందని భావిస్తున్నారు. బిజెపికి బయపడి, పార్టీ మార్పిళ్ల నుంచి కాపాడుకోవడానికి సిఎం తమ ఎంఎల్ఎలను రెండు మార్లు ఛత్తీస్‌గఢ్‌లో క్యాంపుల్లో పెట్టాల్సి వచ్చింది. ఇకపోతే 2019లో చేజారిన జార్ఖండ్‌ను తిరిగి పొందడానికి బిజెపి ఆదివాసీల మనసు గెలిచే సకల యత్నాలూ చేస్తోంది. జెఎంఎం బలంపై గట్టిగా దెబ్బకొట్టాలనే పట్టుదలతో పని చేస్తోంది. చేసిన తప్పును సరిదిద్దుకుంటున్న భావన జార్ఖండ్ ప్రజల్లోకి వెళ్లేలా, బిజెపి గెలిస్తేఈ డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి సాగుతుందని ప్రచారంలో చెబుతున్నారు. ఆదివాసీయేతర నాయకుడు రఘుబర్దాస్‌ని ముఖ్యమంత్రి చేసి ఆదివాసీల కోపానికి కారణమైనట్టు పార్టీ నాయకత్వం గ్రహించింది. అలాగే హేమంత్ సోరెన్ పై కేంద్ర దర్యాప్తు సంస్థల కేసు, అరెస్టుతో అది మరింతగా బలపడి, బిజెపి ఆదివాసీలకు వ్యతిరేకం అన్న భావన కలిగింది. అయితే ముర్మను రాష్ట్రపతిని చేయడం కొంత కలసి వస్తోంది. జార్ఖండ్‌లో ఏ కూటమినైనా.. అంతిమంగా పొత్తులే గట్టెక్కించాలి. ఏ ఒక్కరూ సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయగల ప్రజామద్దతు కూడగట్టే స్థితిలో లేరు. పొత్తుల్లో గెలిచి ప్రభుత్వాలు ఏర్పరచడం, విడిగా పోటీ చేసినపుడు ఓడి విపక్షంలో కూర్చోవడం.. ఈ అనుభవం ఇటు బిజెపి, అటు జెఎంఎం ఇద్దరికీ ఉంది. అందుకే పొత్తుల్ని ఖరారు చేసుకొని కూటమిగానే బరిలో దిగుతున్నారు. 81 స్థానాలున్న రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన మ్యాజిక్ నంబర్ 41. పార్టీల మధ్య పొత్తుతో పాటు సామాజిక సమీకరణాలపైన దృష్టిపెట్టి, గెలుపే లక్ష్యం చేసుకుంటున్నారు. 2014లో విడిగా పోటీచేసి 25స్థానాలు గెలిచిన జెఎంఎం, కాంగ్రెస్‌లు 2019 ఎన్నికల్లో కలిసి పోటీచేసి 47 స్థానాలు గెలిచి, ప్రభుత్వం ఏర్పరిచారు. 2014లో ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు)తో పొత్తు పెట్టుకొని 42 సీట్లు నెగ్గిన బిజెపి, 2019లో పొత్తులు బెడిసి 25 సీట్లకు పరిమితమైంది. ప్రభుత్వం పోయింది. 16శాతం జనాభాగా ఉన్న కుర్మీ మహతోల్లో పట్టున్న ఎజెఎస్‌యు కనీసం 14 అసెంబ్లీ సీట్లలో ప్రభావం చూపుతుంది. రాష్ట్రంలోని 7 జిల్లాలు, 20 సీట్లలో ప్రభావం గల ముస్లీంలు సుమారు 15 శాతంగా ఉన్నారు. ఒబిసి జనాభా 46శాతం ఉంది. అందుకే, బిజెపి(68), ఎజెఎస్‌యు(10), జెడి(యు)(2), ఎల్‌జెపి(1) కలిసి పోటీ చేయాలని సయోధ్యతో ఉన్నాయి. 'ఇండియా' కూటమిలోనూ సీట్ల పంపకాలు జరిగినా.. మూడు స్థానాల్లో మిత్రపక్షాల అభ్యర్థులే పరస్పరం పోటీలో ఉండే పరిస్థితి తలెత్తింది. జెఎంఎం (43), కాంగ్రెస్ (30), రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)(5), సిపిఐ-ఎంఎల్ (3) పార్టీలు కలిసి మొత్తం 81 స్థానాల్లో పోటీ చేయాలనుకున్నారు. కానీ, కాంగ్రెస్‌కు కేటాయించిన రెండు సీట్లలో ఆర్‌జెడి, సిపిఐ-ఎంఎల్‌కు కేటాయించిన ఒక చోట కాంగ్రెస్.. పొత్తులకు విరుద్ధంగా పోటీలో దిగుతున్నాయి. ఇన్ని సంక్లిష్టతల మధ్య జార్ఖండ్ గెలుపు ఎవరిని వరించనున్నదో నవంబరు 23 న తేలనుంది. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో 14లో 9 సీట్లు ఎన్‌డియే కూటమి గెలిచినప్పటికీ, 5 ఎస్‌టి రిజర్వుడు సీట్లలోనూ ఓడిపోయింది. అందుకే, ఈసారి గెలిస్తే ఆదివాసీయే ముఖ్యమంత్రి అనే సంకేతాలు ఇవ్వడానికి బిజెపి నాయకత్వం యత్నిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినా.. కొందరు ఆదివాసీ ముఖ్యనేతలను అసెంబ్లీ బరిలోకి దింపుతోంది. గీతాకోడ , సీతాసోరెన్ , అర్జున్ ముండా, చాంపయ్ సోరెన్ , జెఎంఎం మాజీ ఎంఎల్‌ఎ లోబిన్ ఎంబ్రామ్ వంటి వారు రంగంలో ఉన్నారు. ఆదివాసీ ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో 10, 12 అసెంబ్లీ సీట్లయినా గెలవాలనేది బిజెపి పట్టుదలగా కనిపిస్తోంది. పార్టీలోకి సరయురాయ్ తిరిగి రావడం కలిసొచ్చే అంశమని నాయకత్వం భావిస్తోంది. ఇదే అదనుగా కాంగ్రెస్ కూడా ఎదురుదాడి ప్రచారం చేస్తోంది. బిజెపి గిరిజన, ఆదివాసీ వ్యతిరేకి అనీ ప్రచారం చేస్తోంది. సిఎం హేమంత్ సోరెన్ అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో ఆయన సతీమణి కల్పనా సోరెన్ విస్తృతంగా జనంలో తిరిగి కేంద్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. బొగ్గు రాయల్టీలు ఇవ్వకుండా, రాష్ట్రంపై వివక్ష చూపుతూ కేంద్రం సహకరించక పోవడమేకాక, ఆర్థికంగా జార్ఖండ్‌ను దెబ్బకొట్టే కుట్రలు చేస్తోందనీ చేసిన ప్రచారం ప్రజల్లోకి వెళ్లింది. మయ్యా సమ్మాన్ యోజనతో పాటు రూ. 3584 కోట్ల మేర విద్యుత్ బిల్లుల మాఫీ, రూ.400 కోట్ల మేర రైతు వ్యవసాయ రుణ మాఫీ, డిసెంబర్ నుంచి స్టయిఫెండ్‌ను రూ.2500కి పెంచుతామన్న హామీతో ప్రజల్లో సానుకూలత పెరిగిందని భావిస్తున్నారు. కాంగ్రెస్, జెఎంఎం నుంచి ఎన్నికల ముందు బిజెపిలోకి వెళ్లిన పలువురు నేతలు తిరిగి రావడాన్ని ఓ సానుకూలాంశంగా 'ఇండియా' వర్గాలు భావిస్తున్నాయి.

Printed, Published and Owned by CHERUKU UPENDER, Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Tirumala Nagar Colony, Police Lane, Amberpet, Hyderabad - 500 013 Telangana. Editor: CHERUKU UPENDAR, Publication at HAMSA PUBLICATIONS, H.No: 7-83/2, Hanuman Nagar Colony, Kuntloor, Abdullapurmet Mandal, Hayath Nagar, Pin:501505, Rangareddy District/Hyderabad City, Telangana. E-mail:upendrabbk@gmail.com RNI: TELTEL12215